క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ జుగాదిరావ్

సిర్పూర్(టి): రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయాల్సిన ఈవీఎంలపై ఆదివారం మండలంలోని భూపాలపట్నంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆర్ఐ జుగాదిరావ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామస్తులకు ఈవీఎంల నమూనాలతో అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు ఈవీఎంలలో ఓటు వేసే విధానాన్ని తెలుసుకొని ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమురవెల్లి వెంకటయ్య అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృతుడి కుటుంబాన్ని పరామర్శించి భౌతికకాయానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పద్మశాలీ సేవ సంఘం సభ్యులు ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీ కులస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చెన్నూరి అశోక్, ప్రధాన కార్యదర్శి మోర సంపత్‌లను ఎమ్మెల్యే సన్మానించారు.

రాథోడ్ గణేశ్ పర్యటన



మాట్లాడుతున్న రాథోడ్ గణేశ్

వాంకిడి: కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాథోడ్ గణేశ్ ఆదివారం మండలంలో పర్యటించారు. పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మండల కేంద్రంలోని పెంటు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి ధనవశ్‌కర్‌ను కలిసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. బోర్దా గ్రామంలో శనివారం జైత్‌పూర్ గ్రామంలోని వాగులో గల్లంతైన సెండె అంజన్న కుటుంబాన్ని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు నిజాం, పరుశురాం, మేస్రం, రమేశ్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

రెబ్బెన: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర ఆత్మారాం నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడారు. ఇళ్లు లేని ప్రతీ పేదోడికి డబుల్ బెడ్రూం ఇల్లు అందిస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్.. జిల్లాలో ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇల్లు అందించలేదని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ అంతరాయంతో తిప్పలు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆదివారం గ్రామస్తులు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఆరోపించారు. విద్యుత్ ఉన్నతాధికారులకు ఫోన్ చేస్తే దురుసుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు శంకర్‌గౌడ్, భాస్కర్, సాంబయ్య, మధు, రాజు తదితరులు ఉన్నారు.

‘అంబులెన్స్’ లేక అవస్థలు

- 108 వాహనం కోసం ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో రోగులు
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- పట్టించుకోని అధికారులు



రోడ్డు ప్రమాద బాధితులను 102 వాహనంలో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలో అంబులెన్సు సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. కానీ అత్యవసర సమయాల్లో రోగులను తరలించడానికి మండలంలో అంబులెన్సు ఏర్పాటు చేయకపోవడంతో మెరుగైన చికిత్స కోసం పట్టణాలకు వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. శనివారం పెంచికల్‌పేట్ -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ఆటో చెట్టును ఢీకొట్టడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కాగజ్‌నగర్ పట్టణంలోని ఆసుపత్రికి తరలించేందుకు సుమారు రెండు గంటలపాటు 108 వాహనం కోసం వేచిచూడాల్సి వచ్చింది. 108 వాహనం మొరాయించడంతో క్షతగాత్రులను 102లో ఆసుపత్రికి తరలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పెంచికల్‌పేట్ మండలంలో 108 వాహనం ఏర్పాటు చేస్తే అత్యవసర సమయంలో ఇబ్బందులు ఉండవని ప్రజలు పేర్కొంటున్నారు.

మండలంలో పరిస్థితి..

పెంచికల్‌పేట్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు కమ్మర్‌గాం, గుండెపల్లి, నందిగామ, మురళీగూడ, జిల్లెడ గ్రామాల ప్రజలు అత్యవసర సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మారుమూల గ్రామాల్లోని రోగులను, గర్భిణులను తరలించేందుకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాహనాన్ని సమకూర్చారు. అగర్‌గూడ, ఎల్లూర్, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన ప్రజలు అత్యసర సమయంలో 108 వాహనం కోసం ఎదురుచూస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 35 కిలోమీటర్ల దూరంలోని కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లడానికి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

బెజ్జూర్ వాహనమే దిక్కు..

పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు బెజ్జూర్‌లోని 108 అంబులెన్స్ అత్యవసర సేవలు అందిస్తోంది. బెజ్జూర్ వాహనం సరైన సమయంలో అందుబాటులో లేకుంటే ప్రైవేట్ వాహనాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బాధితులు ప్రయాణం చేస్తున్నారు. దీంతో సరైన సమయంలో వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మండల కేంద్రంలో 108 వాహనం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగిపోతాయని పలువురు పేర్కొంటున్నారు.

‘108’ మంజూరు చేయాలి



మండల కేంద్రంలో 108 వాహనం ఏర్పాటు చేస్తే ప్రజలకు అత్యవసర సేవలు అందుతాయి. రోగులు అత్యవసర సమయంలో ఉన్నత వైద్యం కోసం కాగజ్‌నగర్ వెళ్లడానికి ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 108 వాహనం మంజూరు చేయాలి.

\- కుబిడే రామన్న, పెంచికల్‌పేట్

నేరాల అదుపు కోసమే కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

చింతలమానెపల్లి: నేరాలను అదుపు చేయడానికే పోలీసుల ఆధ్వర్యంలో గ్రామాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. ఆదివారం మండలంలోని చిత్తాం గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిలో తనిఖీలు నిర్వహించి వాహనాల పత్రాలు పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ పోలీసులు మీకోసంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాలని తెలిపారు. గుడుంబా, మత్తు పదార్థాలు అక్రమంగా కలిగి ఉన్నా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. తనిఖీలలో చింతలమానెపల్లి, కౌటాల ఎస్సైలు విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో పలు రైతు కుటుంబాలకు రైతుబీమా చెక్కులను సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఏ కారణంతో మృతి చెందినా కుటుంబం రోడ్డున పడకుండా సీఎం కేసీఆర్ బీమా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కాగజ్‌నగర్ మండలం రాస్పల్లి, బోడేపల్లి గ్రామాలకు చెందిన రైతులు జి.నాగేశ్, రామయ్య కొద్ది రోజుల క్రితం మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులకు రైతుబీమా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, నాయకులు మౌల్కర్ లక్ష్మణ్, బొమ్మెల కిషన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం వేడుకలు



చింతలమానెపల్లి: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పురస్కరించుకుని పీరీల బంగ్లాల వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోలేటిలోని హస్సన్ హుస్సేన్ ఆలయంతో పాటు పుంజుమేరగూడలోని భూవమ్మ తల్లీ దేవాలయంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా వేడుకల్లో పాల్గొంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి పుంజుమేరగూడలోని భూవమ్మ తల్లి ఆలయంలో భూవమ్మ తల్లి పంజా సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భూవమ్మ తల్లి పంజా పీరీని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాల్లో బంగ్లా స్థాపకులు నికోడే శ్రీకర్, అధ్యక్షుడు వినోజ్ జైస్వాల్, సభ్యులు శ్రీకాంత్, నిమ్మాజీ, భగవాన్, రాకేష్, వికటేష్, రాజు, సిద్దార్థ, సాయిలు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం సవార్లకు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. నెలపొడుపు కనిపించిన నాటి నుంచి ఐదు రోజులపాటు పూజలు నిర్వహించనున్నట్లు సవార్ల పూజారి బాపు తెలిపారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



తిర్యాణి: దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులు



వాంకిడి: నిరసన తెలుపుతున్న కార్మికులు

తిర్యాణి/కౌటాల/వాంకిడి/రెబ్బెన /ఆసిఫాబాద్ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె జిల్లాలో ఆదివారం 18వ రోజు కొనసాగింది. ఆయా మండల కేంద్రాల్లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు.

బెజ్జూర్ ఎస్సైగా విక్రమ్



బాధ్యతలు స్వీకరిస్తున్న విక్రమ్

బెజ్జూర్: బెజ్జూర్ నూతన ఎస్సైగా విక్రమ్ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా ఉన్న వెంకటేష్ ఆసిఫాబాద్‌కు బదిలీ కాగా కాగజ్‌నగర్‌టౌన్‌లో ఎస్సైగా ఉన్న విక్రమ్ బెజ్జూర్‌కు వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రమన్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఈజ్‌గాం ఎస్సై రమన్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని సారసాల గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. యువత సన్మార్గంలో నడుస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. గుడుంబా, గంజాయి, పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలోనే గ్రామాలు

బేల: మండలంలోని మాంగ్రుడ్ గ్రామంతో పాటు సాంగిడిరింగ్ రోడ్డు మార్గంలోని మణియార్‌పూర్, గూడ, కాంఘుర్‌పూర్, బెదోడ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు బహ్యప్రపంచానికి దూరంగా ఉన్నారు. అలాగే కొగ్దూర్, దహెగాం, సాంగిడి, కొత్త సాంగిడి, నారయణ్‌పూర్, అవాల్‌పూర్ గ్రామాల్లో దాదాపు 2 వేల ఎకరాల వరకు పంటలు పెన్‌గంగ బ్యాక్‌వాటర్‌తో మునిగిపోయినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

గ్రామ దేవతలకు పూజలు

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామంలో మథుర కులస్తులు ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పండాలని కోరుకున్నారు.

ప్రాణహితకు పెరిగిన వరద



కౌటాల: ప్రాణహిత వరదనీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సాయన్న

కౌటాల: మండలంలో ప్రాణహిత నది ప్రవాహం ఆదివారం మరింత పెరిగింది. తుమ్మిడిహెట్టి వద్ద గల పుష్కర ఘాట్లు వరద నీటిలో మునిగిపోయాయి. తాటిపల్లి, గుండాయిపేట వద్ద పెన్‌గంగ నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మహారాష్ట్రకు నాటు పడవల రాకపోకలు నిలిచిపోయాయి. నదుల్లో వరదనీరు పెరగడంతో సమీప పంట చేలు నీటిలో మునిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణహితలో వరదనీరు పెరిగిందని స్థానికులు అప్రమత్తంగా ఉండాలని తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రాణహిత నది సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాయన్న అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రతో పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ప్రాణహితకు వరద పోట్టెతిందన్నారు. గంగపుత్రులు చేపల వేటకు వెళ్లవద్దని, నాటు పడవల రాకపోకలు నిలిపి వేయాలని ఆదేశించారు. ఆయన వెంట వీఆర్ఏలు ప్రకాశ్, రేవంజీ, తదితరులు ఉన్నారు.

కెరమెరిలో ఉప్పొంగిన వాగులు, వంకలు

కెరమెరి: మండలంలోని తుమ్మగూడ, ధనోరా, గోయగాం, అంబారావు, మెట్టపిప్రి, సాంగ్వి గ్రామాల సమీపంలో ఉన్న వాగులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కెస్లాగూడ గ్రామసమీపంలో ఉన్న అమ్మన్నమడుగు ప్రాజెక్టులోకి నీరు గణనీయంగా వచ్చి చేరింది.

వరద ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లొద్దు



ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఐ

చింతలమానెపల్లి: వరద నీరు ఉన్న ప్రాంతాల్లోకి ప్రజలు ఎవరూ వెళ్లొద్దని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. మండలంలోని గూడెం, దిందా, చిత్తాం, కేతిని గ్రామాల సమీపంలోని ప్రాణహిత పరీవాహక ప్రాంతాలలో వరద ఉధృతిని ఆయన ఆదివారం పరిశీలించారు. ఆయా గ్రామాల పరిధిలోని నదిలో ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సైలు విజయ్, ప్రవీణ్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ బోనాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

రెబ్బెన: మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డప్పువాయిద్యాల నడుమ మహిళలు నెత్తిన బోనం ఎత్తుకుని రేణుక ఎల్లమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు కార్యక్రమంలో పాల్గొని బోనాలకు పూజలు చేశారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య నెత్తిన బోనం ఎత్తుకున్నారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవీ, బీఆర్ఎస్ నాయకులు అరుణ, శంకరమ్మ, శ్రీధర్, రాజేశ్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1979 -80వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. 43 సంవత్సరాల తర్వాత మిత్రులంతా ఒకచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులు జగదీశ్వరయ్య, కిష్టయ్య, సత్యమూర్తులను ఘనంగా సత్కరించారు. చీల వెంకటేశ్వర్, రమేశ్, అభయ్‌కుమార్ ఆచార్య, ముక్తా విలాస్, పరముని మధు, శ్రీకాంత్, పోలంపల్లి రమేశ్, పాల్వాయి సుధాకర్, పెండ్యాల సుజాత, సురేఖ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

చెన్నూర్: స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న పదో తరగతి విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ గురుకుల పాఠశాలలను ఉన్నతాధికారులు సందర్శించాలన్నారు.

మహిళలను నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటు



నిరసన తెలుపుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: మణిపూర్‌లో మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడి నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటని టీఎస్ యూటీఎఫ్, టీపీఆర్టీయూ, ఏటీఏ, టీయూటీఎఫ్ నాయకులు అన్నారు. సంఘటనను నిరసిస్తూ ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పక్షాన కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు శాంతికుమారి, శ్యాంసుందర్, తలండి లక్ష్మణ్, నాగేశ్, కటకం మధుకర్‌లు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా మారణహోమం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం శాంతిని నెలకొల్పడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అప్రోచ్ రోడ్డుకు పగుళ్లు



పగుళ్లు తేలి, కోతకు గురైన అప్రోచ్ రోడ్డు

దహెగాం: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పెంచికల్‌పేట్ పెద్దవాగుపై వంతెన వద్ద ఉన్న అప్రోచ్ రోడ్డు పగుళ్లు తేలి, మట్టి కోతకు గురైంది. దీంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోవడం, రోడ్డు పగుళ్లు తేలడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డుపై కంకర పోసి ప్రయాణ కష్టాలు తీర్చాలని మండల వాసులు కోరుతున్నారు.

సంఘం బలోపేతానికి కృషి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గడిదాసు మల్లయ్య, లింగయ్య, ప్రసాద్, శ్రీనివాస్, నారాయణ, పవన్, శ్రీకాంత్, వంశీ, సునీత, రోజా, రుచిత తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

సిరికొండ: నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండపూర్ సమీపంలో వరదకు కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899